క్లుప్తంగా

కరెంట్ కష్టాలు తీర్చాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య

వీర్నపల్లి: ప్రభుత్వం విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య మండలంలోని వన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల పాటు కరెంట్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పుతోందన్నారు. గ్రామాల్లో ఆరు, ఏడు గంటల పాటు కరెంట్ ఇవ్వడం ద్వారా రైతులు ఇబ్బంది పాలు అవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు వ్యవసాయానికి సరిపడ కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్యాల జాన్సన్, మాట్ల అశోక్, గజ్జెల ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

మా భూములకు పట్టాలు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నిరుపేద రైతులు

వేములవాడరూరల్: మా భూములకు పట్టాలు ఇవ్వాలని వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద రైతులు వేములవాడ రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలకు 1970–71లో సుమారుగా 132 ఎకరాల భూములకు పట్టాలు అందజేశారన్నారు. ఇప్పటికి ఆ భూముల్లో పంటలు పండిస్తున్నామన్నారు. కాని ప్రభుత్వం ధరణి తీసుకువచ్చినప్పటి నుంచి ఆన్‌లైన్‌లో మా పేరు రావడం లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు చొరవతీసుకుని మాకు ఇచ్చిన భూములను ధరణిలో తమ పేర్లు నమోదు చేసి పట్టా పాస్‌బుక్కులు అందించాలని కోరుతున్నామన్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్ళపల్లి, ఇల్లంతకుంట గ్రామాల్లో శుక్రవారం హరిత నర్సరీలను ఏపీవో చంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ నర్సరీలలో మొలకెత్తుతున్న మొక్కలను సంరక్షించేందుకు ప్రతి రోజు రెండుసార్లు నీళ్లు పట్టాలని, ఎండల తీవ్రత పెరుగుతున్నందున షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

అన్ని ఉన్నా.. వైద్యం సున్నా

- పీహెచ్‌సీలో సిబ్బంది కొరత
- తుప్పు పడుతున్న పరికరాలు
- లక్షల ప్రజాధనం వృథా



హన్మాజిపేటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వేములవాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతతో వెలవెలబోతున్నది. వేములవాడ మండలంలోని హన్మాజిపేట గ్రామంలో 2015 ఆగస్టు 27న రూ.13.40 లక్షలతో ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా ఇక్కడి ప్రజలకు వైద్య సేవలు అందలేదు.

సిబ్బంది కొరతే కారణం

మండలంలోని హన్మాజిపేట, బొల్లారం, లింగంపల్లి, మల్లారం గ్రామాలతో పాటు పక్క మండలమైన కోనరావుపేట మండల ప్రజలకు కూడా ఈ వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఈ ఆసుపత్రి ప్రారంభించింది. ఈ ఆసుపత్రిలో చిన్న పిల్లల నుంచి మొదలుకుని పెద్దల వరకు కావాల్సిన పరికరాలను కూడా అందుబాటులో ఉంచారు. 8 ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఈ ఆసుపత్రికి ప్రత్యేక వైద్యాధికారి, సిబ్బందిని నియమించకపోవడంతో ఆశావర్కర్లు, ఏఎస్ఎమ్‌లు, ఇన్‌చార్జిలు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న నాలుగు గ్రామాల ప్రజలకు అత్యవసర సేవలు అవసరం ఉంటే వేములవాడ ఆసుపత్రికి వెళ్లక తప్పడం లేదు. పలుసార్లు ఈ ప్రాంత ప్రజలు ఈ ఆసుపత్రికి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి వైద్య సేవలు అందించాలని కోరినా ఫలితం లేదని వాపోతున్నారు.



ఆసుపత్రిలో తుప్పు పడుతున్న పరికరాలు

ప్రస్తుతం పని చేసే సిబ్బంది

ఈ ఆసుపత్రిలో ఒకరు ఇన్‌చార్జి వైద్యాధికారి, ఇద్దరు ఏఎన్ఎమ్‌లు, నలుగురు ఆశావర్కర్లతో వైద్య సేవలను ఈ ప్రాంతవాసులకు అందజేస్తున్నారు. వీరు కూడా ఎక్కడ అత్యవసర సేవలు ఉన్నా ఈ సిబ్బందినే పంపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమానికి హన్మాజిపేటలో పనిచేసే ఈ సిబ్బందిని పంపించడంతో కొన్ని రోజులుగా ఈ ఆసుపత్రిలో కనీస వైద్య సేవలు అందించేవారు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సిబ్బందిని కేటాయించాలి



ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందడం లేదు. ఆసుపత్రి అన్ని హంగులతో నిర్మించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సిబ్బందిని నియమించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. – ఆడెపు విజయ్, హన్మాజిపేట

పేరుకే ఆసుపత్రి



ఎనిమిదేళ్ల నుంచి ఆసుపత్రి ఉన్నా వైద్యం అందడం లేదు. ఎలాంటి చిన్న ఇబ్బంది వచ్చినా వేములవాడకు వెళ్లాల్సిందే. లక్షల రూపాయలతో నిర్మించి వృథాగా వదిలివేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలి. సిద్ధంశెట్టి నర్సయ్య, హన్మాజిపేట

నిధులు మంజూరయ్యాయి

ఆసుపత్రిలో కొన్ని పనుల మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. దాని కోసం రూ.4 లక్షలు మరమ్మతు కోసం, రూ. 8 లక్షలు ఆసుపత్రి పరికరాల కోసం ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. వెంటనే టెండర్ పెట్టి పనులు ప్రారంభిస్తాం. – పవనకుమారి, ఏఈ, పంచాయతీరాజ్, వేములవాడ

మండలంపై చిన్నచూపు ఎందుకో?

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్
- అభివృద్ధి పనులకు బిల్లులు రాక ఇబ్బందులు



మాట్లాడుతున్న ఎంపీపీ మాలోత్ భూల

వీర్నపల్లి: మండలాన్ని చిన్నచూపు చూస్తున్నారని అభివృద్ధి పనులు జరగడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రశ్నించారు. ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు మండలంలో అభివృద్ధి పనులు ముందుకు వెళ్లడం లేదని అధికారులపై మండిపడ్డారు.

➡ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మండలం ఏర్పాటై ఆరేళ్లు గడుస్తున్న అద్దె భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తున్నాయని ప్రభుత్వం వెంటనే స్పందించి స్థలాన్ని కేటాయించి ప్రభుత్వ కార్యాలయాలకు పక్క భవనాలను నిర్మించాలన్నారు.

➡ వ్యవసాయానికి రైతులకు విద్యుత్ సరిపోవడం లేదని 24 గంటల విద్యుత్ అందజేస్తానని చెప్పి ఆరు, ఏడు గంటల కరెంట్ ఇవ్వడం ద్వారా రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

➡ సర్పంచులు సాగర్, దినాకర్ మాట్లాడుతూ చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చేసిన పనుల బిల్లులను రికార్డ్ చేయడంలో జాప్యం చేయడం వలన ఆగ్రహం వ్యక్తం చేశారు.

➡ సీతారాంనాయక్ తండా సర్పంచ్ రవి మాట్లాడుతూ నివేదికలో తప్పుడు సమాచారం ఇస్తున్నారని సెస్ సిబ్బందిపై మండిపడ్డారు. అంతకు ముందు ఎంపీటీసీ హేమ భర్త దేవేందర్ చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, రైతుబంధు అధ్యక్షుడు సాగర్, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో నరేశ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్

- వరంగల్ మాజీ ఎంపీ కాటం సురేశ్‌రెడ్డి
- సిరిసిల్లలో బీజేపీ కార్నర్ మీటింగ్



మాట్లాడుతున్న కాటం సురేశ్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ఇన్నేళ్లుగా అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ వరంగల్ మాజీ ఎంపీ కాటం సురేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం సిరిసిల్లలోని సంజీవయ్యనగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. సిరిసిల్లలో రోడ్లు తప్ప కేటీఆర్ చేసిన అభివృద్ధి ఏమిలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమి అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. దళితులను మోసం చేసి పాలన సాగిస్తున్నాడని దుయ్యబట్టారు. 24 గంటల కరెంటు అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



బస్వాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామ పరిధిలో శుక్రవారం చీర్లవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అందరూ ఉచితంగా కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రామకృష్ణ, సర్పంచ్ గొడిసెల నీరజ, ఎంపీటీసీ పూర్మాని కనకలక్ష్మి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డి, నాయకులు కర్నె బాలయ్య, తాటిపాముల శ్రీనివాస్, మోతె మహేశ్ యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇల్లంతకుంట: కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ

ఇల్లంతకుంట: మండలంలోని సోమారంపేట గ్రామంలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ కాసం శ్రీనివాసరెడ్డి, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, వైద్యురాలు శరణ్య, ఉపసర్పంచ్ రాజు, కార్యదర్శి ప్రియాంక పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో ఉచిత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ ఆరెపల్లి లత ప్రారంభించారు. కార్యక్రమంలో కొదురుపాక పీహెచ్‌సీ వైద్యాధికారి రేణు ప్రియాంక, క్యాంపు మెడికల్ ఆఫీసర్ వినూత్న, నాయకులు పాల్గొన్నారు.

బాలుడికి ఎంపీ సంజయ్ పరామర్శ



బాలుడితో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట: విద్యుత్ వైర్లకు తగిలి గాయాలపాలై. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుంబాల మహిత్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. మండలంలోని పదిర గ్రామానికి చెందిన తెలంగాణ పీపుల్స్ ఫోరం అధ్యక్షుడు కుంబాల మహేందర్‌రెడ్డి కుమారుడు మహిత్‌రెడ్డి ఇంటి భవనంపై ఉన్న కోతులను ఇనుపరాడుతో కొట్టగా, పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి గాయాలయ్యాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లి గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ కనిపించిందన్నారు. అనుమానంతో ట్రాక్టర్‌ను ఆపితే డ్రైవర్ పరారయ్యాడని పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

స్థలదాతకు సంతాపం

బోయినపల్లి: మండల విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భవనానికి స్థలం వితరణగా ఇచ్చిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు జంకె మోహన్‌రెడ్డి మృతిపై మండల సంఘ నాయకులు శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ద్యావనపెల్లి శ్రీహరి, గౌరవ అధ్యక్షుడు సీ.రామరాజు, కార్యదర్శి దండు రాజమల్లయ్య, తోట నర్సయ్య, చాడ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జిపై ప్రయాణం.. హై'టెన్షన్'

- వంతెనపై హైటెన్షన్ విద్యుత్ వైర్లు
- లక్ష్మీపూర్ వైపు వెళ్లాలంటే భయం
- విద్యుత్ వైర్లను తొలగించాలంటున్న ప్రయాణికులు



సండ్రవాగు వంతెనపై ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి నుంచి లక్ష్మీపూర్ మీదుగా ఇల్లంతకుంట మండలం వెళ్లేందుకు నిర్మించిన వంతెన పైనుంచి వెళుతున్న 33 కేవీ విద్యుత్ లైన్ వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇల్లంతకుంట వరకు వెళ్లాలంటే సండ్రవాగు దాటి వెళ్లాల్సిందే. అయితే వర్షాకాలంలో నీరు ఉప్పొంగి ప్రవహించి రాకపోకలు నిలిచిపోతూ ఉండేవి. వంతెన నిర్మించాలని ప్రజల విజ్ఞప్తుల మేర సుమారు రూ.2 కోట్లతో వంతెన నిర్మాణం కూడా పూర్తయ్యింది. తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. కానీ అక్కడే చిక్కు సమస్య వచ్చి పడింది. వంతెనపైన 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉండడంతో వాహనదారులు అటువైపుగా ప్రయాణించాలంటే జంకుతున్నారు. కోట్లు వెచ్చించి నిర్మించిన వంతెన నిరుపయోగంగా మారే పరిస్థితి ఏర్పడింది.

నిద్రమత్తులో అధికారులు

వంతెన పైనుంచి 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలను తొలగించే విషయంలో ఎన్పీడీసీఎల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనిపిస్తోంది. వంతెన నిర్మాణం పూర్తయి దాదాపు 8 నెలలు కావొస్తున్నా ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్ల తొలగింపు విషయంలో మాత్రం తాత్సారం చేస్తూ వస్తున్నారు. సిరిసిల్ల పరిధిలో సిరిసిల్ల విద్యుత్ సరఫరా సంఘం లిమిటెడ్ (సెస్) సంస్థ ఉన్నప్పటికీ 33 కేవీ ఆపైన గల హైటెన్షన్ తీగల మెయింటెనెన్స్ ఎన్పీడీసీఎల్ పరిధిలోనే ఉంది. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారింది. వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ నిబంధనల మేరకు కరెంటు తీగలను తొలగించేందుకు రూ.2 లక్షలు వరకు రుసుము కూడా చెల్లించారు. అయినప్పటికీ ఎన్పీడీసీఎల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

ప్రమాదం జరిగితే.?

వంతెన పైనుంచే హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని ప్రయాణికులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. విధిలేని పరిస్థితిలో తప్పనిసరిగా ఆ వంతెనపై ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. భారీ వాహనాలు వెళితే కరెంటు తీగలకు తాకే ప్రమాదం ఎక్కువగా ఉంది. ఇల్లంతకుంట వైపుగా లారీలు, ఆర్టీసీ బస్సులు వెళుతుంటాయి. ఆర్టీసీ బస్సుకు ఒకవేళ కరెంట్ తీగల మూలంగా ప్రమాదం సంభవిస్తే భారీగా ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పుడు మొద్దు నిద్రలో జోగుతున్న అధికారులు ప్రాణాలు పోయాక హడావుడి చేస్తారా.? అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగితే ఎన్పీడీసీఎల్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

వైర్లు తొలగించాలి



చీర్లవంచతోపాటు ఇల్లంతకుంట వెళ్లే ప్రజలు ఈ దారిలో ప్రయాణిస్తుంటారు. మంత్రి కేటీఆర్ చొరవతో వంతెన నిర్మించారు. కానీ హైటెన్షన్ విద్యుత్ తీగలతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. – జక్కుల రవీందర్, సర్పంచ్ చీర్లవంచ

అధికారులు స్పందించాలి



లక్ష్మీపూర్ శివారు సండ్రవాగుపై వంతెన నిర్మాణం పూర్తయ్యి దాదాపు 9 నెలలు కావొస్తోంది. వంతెన పైనుంచి వెళుతున్న హైటెన్షన్ వైర్లను తొలగించాలని కాంట్రాక్టర్ రూ.2 లక్షలు రుసుము కూడా చెల్లించారు. వెంటనే వైర్లను వంతెన పైనుండి తొలగించాలి. – మిట్టపల్లి పద్మ, సర్పంచ్ లక్ష్మీపూర్

త్వరలోనే తొలగిస్తారు



లక్ష్మీపూర్ సండ్రవాగు వంతెన పైనుంచి వెళుతున్న 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగల తొలగింపు విషయం మా దృష్టిలో ఉంది. ఇప్పటికే దానికి సంబంధించిన రుసుము కూడా చెల్లించారు. ఎన్పీడీసీఎల్ అధికారులు త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. – ప్రశాంత్, సెస్ ఏఈ తంగళ్లపల్లి

సమాచారం

టెక్నికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్, నాలెడ్జ్ (టాస్క్) ప్రాంతీయ కేంద్రంలో పలు టెక్నికల్ కోర్సుల్లో అర్హులైన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సీ లాంగ్వేజ్, డేటా స్ట్రక్చర్, జావా ఫుల్‌స్టాక్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ తరగతులను ఈ నెల 13 నుంచి గ్రంథాలయ భవనంలోని టాస్క్ ప్రాంతీయ కేంద్రంలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు 70755 22671 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వ్యక్తిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

తంగళ్లపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సికింద్రాబాద్ నివాసి హమార ప్రసాద్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అంబేడ్కర్ యువజన సంఘం తంగళ్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కర్నె బాలయ్య, నాయకులు ఎల్లయ్య, సాయిబాబ, దేవయ్య, శ్యాగ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఎల్లారెడ్డిపేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు నీరటి భాను డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసే నమోదు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటివి పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆశ్రమానికి అనాథల తరలింపు



అనాథలను ఆశ్రమానికి తరలిస్తున్న శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: జిల్లా ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో చాలా రోజులుగా తలదాచుకుంటున్న పెంట దేవదాసు, కోట రాజేశం అనే అనాథలను సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు చీకోటి అనీల్ కుమార్ గుర్తించారు. ప్రతీరోజు ఏరియా ఆస్పత్రిలోని నిత్యాన్నసత్రంలో తింటూ కాలం వెల్లదీస్తున్న వీరి కష్టాలను తెలుసుకుని డీడబ్ల్యూవో లక్ష్మీరాజంకు వివరించారు. ఇద్దరిని వెంటనే ప్రభుత్వ అనాథాశ్రమానికి తరలించారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం



పై ఫొటోలో కనిపిస్తున్నది వేములవాడ–సిరికొండ రోడ్డు కేజ్‌వీల్స్ కారణంగా పది కాలాల పాటు మన్నాల్సిన ఈ రోడ్డు ధ్వంసమైంది. కేజ్ వీల్స్‌తో రోడ్లపై తిరిగితే జరిమానాలు విధిస్తామని బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసుల, అధికారుల హెచ్చరికలు జారీ చేసినా ట్రాక్టర్ యజమానులు బేఖాతరు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం రూ. కోటి వ్యయంతో నిర్మించిన కమ్మరిపేటతండా, గొల్లపల్లి–వట్టిమల్ల రోడ్డు కేజ్‌వీల్స్ వల్ల పనికిరాకుండా పోయింది. కేజీవీల్స్‌తో రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – కోనరావుపేట